# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 23-09-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఆదేశించారు.**

2. **ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం కొనసాగుతోంది.**

3. **రాష్ట్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రులు, ఔషధాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

4. **ఎల్‌నినో ప్రభావంతో రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతోందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**

==========================

వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ వాయుగుండం ఈ రోజు రాత్రి నుంచి రేపు తెల్లవారుజామున విశాఖపట్నం –గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించింది. మరిన్ని వివరాలను వాతావరణ కేంద్ర సంచాలకులు కె.నాగరత్న తెలియజేస్తూ,

వాయిస్ .30..సెకన్లు

-------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను అప్రమత్తం చేశారు. ప్రభుత్వ కార్యదర్శి, డీజీపీ, మంత్రులు, వివిధ శాఖల అధికారులతో రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఉత్తరాంధ్రతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

కాగా.. వాగులు, వంకలు, ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలనిఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, మందులు అందుబాటులో ఉంచాలని, పశువులకు

మేత, నీటి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

---------------------------

వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులను మంత్రులు పి. నారాయణ, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అప్రమత్తం చేశారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా అదనపు సిబ్బందితో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉన్నందున మున్సిపల్, పారిశుధ్య, ఆర్టీసీ, రవాణా సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలకు సిద్ధంగా ఉండాలని మంత్రులు ఆదేశించారు. విజయవాడలో కొండ ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి నారాయణ ఆదేశించారు. వర్షాల పరిస్థితిని అమరావతి నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు మంత్రులు సూచించారు.

---------------------------

ఉత్తరాంధ్రలో భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈరోజు సమీక్ష నిర్వహించారు. వర్షాల దృష్ట్యా ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే త్వరితగతిన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. సిబ్బందిని అందుబాటులో ఉంచి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు.

---------------------------

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో 60కి పైగా అజెండా అంశాలపై మంత్రివర్గం చర్చిస్తోంది. ఈ సమావేశంలో పెట్టుబడులు, పరిశ్రమలు, అమరావతి అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉందని, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పరిశ్రమల ఏర్పాటుకు భూ కేటాయింపులపై చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'సేవా సంకల్ప అభియాన్' ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా దేశంలో స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యత కోసం చేపట్టిన 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' కార్యక్రమం గురించి ఈరోజు తెలుసుకుందాం.

భారతదేశంలోని అనేక జిల్లాల ఆర్థిక వ్యవస్థల్లో స్థానిక ప్రత్యేకతలకు తగిన గుర్తింపు, మార్కెట్ అందుబాటు గతంలో పరిమితంగానే ఉండేది. స్థానిక ఉత్పత్తులకు సరైన ఆదాయాలు కూడా ఆశించిన స్థాయిలో ఉండేవి కావు. ఈ పరిస్థితిని మార్చేందుకు దేశంలోని జిల్లాల ప్రత్యేకతలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్ 'ఒక జిల్లా -ఒక ఉత్పత్తి', కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి', కార్యక్రమం కింద ధర్మవరం చీరలు, ఏటికొప్పాక బొమ్మలు, నరసాపురం అల్లిక లేసులు వంటి

ప్రత్యేక ఉత్పత్తులను గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. ఒక జిల్లా–ఒక ఉత్పత్తి ద్వారా ప్రతి జిల్లా తన ప్రాంతంలో ప్రత్యేకంగా తయారు చేసే ఒక ఉత్పత్తికి అభివృద్ధి, బ్రాండింగ్, మార్కెటింగ్‌కు అవకాశం కలుగుతుందని ప్రధానమంత్రి తెలియజేస్తూ..

వాయిస్..25.. సెకన్లు

---------------------------

సమగ్రమైన వైద్య చికిత్స పద్ధతిగా ఆయుర్వేదాన్ని ప్రోత్సహించేందుకు ఈరోజు ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2016లో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. అప్పటినుండి ప్రతి యేటా సెప్టెంబర్ 23న ఆయుర్వేద దినోత్సవాన్ని జరుపుకుంటారు. నివారణ ప్రధానమైన ఆరోగ్య సంరక్షణలో ఆయుర్వేద వైద్య చికిత్స పద్ధతి ఓ కీలక పాత్రను పోషిస్తోంది. ఆయుర్వేద వైద్య విధానంపై పలు కార్యక్రమాల ద్వారా ఈరోజు అవగహన కల్పిస్తారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రులు, ఔషధాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని మంత్రి ప్రకటన విడుదల చేశారు. "ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం" అనే ఇతివృత్తంతో ఈరోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఆరు జిల్లాల్లో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రుల నిర్మాణం, పరికరాల కొనుగోలుకు 27 కోట్ల రూపాయలు ఆమోదించినట్లు చెప్పారు.

---------------------------

ఎల్‌నినో ప్రభావంతో రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతోందని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలని, తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆక్వా రంగంపై ప్రభావాన్ని అంచనా వేసి నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విశాఖపట్నానికి చెందిన స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం మహా నగరపాలక సంస్థ – జీవీఎంసీ పరిధిలో పార్టీ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణతో పాటు స్థానిక రాజకీయ పరిణామాలపై జగన్మోహన్ రెడ్డి చర్చించారు. కాగా విజయవాడలోని లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో ఈరోజు సాయంత్రం జగన్మోహన్ రెడ్డి సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా విజయవాడ శాప్ కార్యాలయం వద్ద జరిగిన ఘటనలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------